క్లుప్తంగా

నెట్టికంటుడి సేవలో కర్నూలు జిల్లా జడ్జి


తీర్థ ప్రసాదాలను అందజేస్తున్న దృశ్యం

గుంతకల్లు రూరల్: కర్నూలు జిల్లా జడ్జి జి.కబర్థి, సబ్ జడ్జి శేషాద్రి గురువారం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. ఈసందర్భంగా వారికి ఆలయ అధికారులు, అర్చకులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో జడ్జి కుటుంబ సభ్యుల పేరున స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అర్చకులు వారికి తీర్థప్రసాదాలు, శేష వస్త్రాలను అందజేశారు.

చిన్నారుల సంరక్షణకు కృషి


మాట్లాడుతున్న సీడీపీఓ సాజిదాబేగం

పెద్దవడుగూరు: అంగన్‌వాడీ కేంద్రాలల్లోని చిన్నారులకు విలువలతో కూడిన విద్యను అందించి, వారి సంక్షేమం కోసం కృషి చేయాలని తాడిపత్రి సీడీపీఓ సాజిదాబేగం సూచించారు. గురువారం మండలంలోని క్రిష్టిపాడు గ్రామంలో రెండో రోజు పెద్దవడుగూరు, క్రిష్టిపాడు సెక్టార్లల్లోని కార్యకర్తలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ పౌష్టికాహారం అందించడంలో నిర్లక్ష్యం వీడాలని సూచించారు. పిల్లలకు ఎలాంటి కార్యక్రమాలు చేస్తే, ప్రేరణ కలుగుతుందో వివరించారు. అనంతరం స్థూల పోషకాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో స్పెషల్ ట్రెనీ సూపర్‌వైజర్లు వెంకటలక్ష్మి, కల్పన, అంగన్‌వాడీ కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

31లోగా ఈ–కేవైసీ చేయించుకోవాలి

గుంతకల్లు రూరల్: రేషన్ కార్డు లబ్ధిదారులు ఈనెల 31లోపు ఈ–కేవైసీ నమోదు చేయించుకోవాలని సీఎస్‌డీటీ సుబ్బలక్ష్మి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ–కేవైసీ చేయించుకోవాల్సిన లబ్ధిదారుల వివరాలు సంబంధిత రేషన్ డీలర్ లేదా సంబంధిత వీఆర్వో వద్ద ఉన్నాయన్నారు. 5 సంవత్సరాల్లోపు ఉన్న చిన్న పిల్లలు 80 సంవత్సరాలు పైబడిన వృద్ధులు ఈ–కేవైసీ చేయించుకోవాల్సిన అవసరం లేదన్నారు. మిగిలిన ప్రతి ఒక్కరూ ఈకేవైసీ చేయించుకోవాలని, లేని పక్షంలో ఏప్రిల్‌లో నిత్యావసర సరుకులు అందకుండా పోతాయని ఆమె హెచ్చరించారు.

పూర్వ విద్యార్థుల దాతృత్వం


బస్టాండ్ సమీపంలో ఏర్పాటు చేసిన కూల్‌వాటర్ మిషన్

తాడిపత్రిటౌన్ (యాడికి): యాడికి మండల కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో రాయల్ షూమార్ట్ వద్ద గురువారం స్థానిక జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు కూల్ వాటర్ మిషన్‌ను ఏర్పాటు చేశారు. ఎండల మండుతుండటంతో ప్రయాణికులు, పాదచారుల ఇబ్బందులను దృష్టిలో వుంచుకొని చల్లని తాగునీరు అందించాలన్న సకల్పంతో కూల్ వాటర్ మిషన్‌ను ఏర్పాటు చేసినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో పవన్, బాల, రామయ్య, సత్య, ప్రభాకర్‌రెడ్డి, ప్రెస్ శీన, నూర్, శర్మస్ తదితరులు పాల్గొన్నారు.

రంజాన్ కిట్ల పంపిణీ

గుంతకల్లుటౌన్: రంజాన్ పండుగను పురస్కరించుకుని ఐడియల్ యూత్ మూవ్‌మెంట్(ఐవైఎం) కమిటీ ఆధ్వర్యంలో గురువారం పట్టణానికి చెందిన 50 నిరుపేద ముస్లిం కుటుంబాలకు రంజాన్ రేషన్ కిట్‌లను పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న హాఫీజ్ ఇస్మాయిల్ సాబ్, నబీరసూల్‌సాహెబ్ కిట్లను అందజేశారు. కార్యక్రమంలో ఐవైఎం పట్టణ అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్, కార్యదర్శి అబ్దుల్ రహిమాన్, కోశాధికారి ఖాజాముక్తియార్, షేక్షా, సభ్యులు పాల్గొన్నారు.

'కోనా'కు పరామర్శ


కోనా మురళీధర్‌రెడ్డిని పరామర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

గుత్తి: గుత్తి మాజీ ఎంపీపీ , వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు కోనా మురళీధర్‌రెడ్డిని గురువారం వైఎస్సార్ సీపీ నాయకులు పరామర్శించారు. గత మంగళవారం కోనా ఇంటిపై టీడీపీ శ్రేణులు దాడి చేసి ఇంటి అద్దాలు పగలగొట్టడంతో పాటు కారును ధ్వంసం చేసిన విషయం తెలిసిందే. వైఎస్సార్ సీపీ జిల్లా నాయకులు మంజునాథ్ రెడ్డి, పామిడి వీరా, రాజ్‌కుమార్ రెడ్డి, గాది లింగేశ్వర బాబు తదితరులు కోనా ఇంటికి వెళ్లారు. కోనాతో పాటు కుటుంబ సభ్యులను పరామర్శించారు. దాడి ఘటన గురించి అడిగి తెలుసుకున్నారు.

త్యాగానికి ప్రతీక ముసలమ్మ తల్లి

- నేటి నుంచి 5వ వార్షికోత్సవం
- ముసలమ్మ కట్ట వద్ద ఏర్పాట్లు పూర్తి

బుక్కరాయసముద్రం: ముసలమ్మ తల్లి త్యాగానికి ప్రతీకగా నిలుస్తోంది. అమ్మవారు భక్తులు కోరిన కోర్కెలు తీర్చే కొంగుబంగారంగా ప్రసిద్ధి చెందారు. మండల కేంద్రంలోని తాడిపత్రి రహదారి పక్కన చెరువు కట్ట సమీపంలో నూతనంగా ఎంతో సుందరంగా ముసలమ్మ దేవాలయాన్ని ముసలమ్మ వంశీయులు, ఆలయ అభివృద్ధి కమిటీ చైర్‌పర్సన్ సుశీల, సూర్యనారాయణరెడ్డి, నిర్మించారు. ఆలయంలో శుక్రవారం, శనివారం 5వ వార్షికోత్సవ కుంభాభిషేకం నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించి నిర్వాహకులు ఆలయంలో ఏర్పాట్లు పూర్తి చేశారు.

ఆలయ చరిత్ర

బుక్కరాయసముద్రం మండల కేంద్రానికి సమీపంలో ఉన్న చెరువు సుమారు 300 ఏళ్ల క్రితం చెరువు నిండి ఉప్పొంగి ప్రవహిస్తోంది. దీంతో చెరువు కట్ట తెగిపోయింది. చెరువులో ఉన్న నీరు అంతా ఊరంతా ముంచే విధంగా ప్రవహిస్తోంది. దీంతో గ్రామంలో ఉన్న ప్రజలంతా గ్రామ సమీపంలో ఉన్న పోలేరమ్మను ప్రార్థించారు. ఈ సమయంలో చెరువు కట్ట సమీపంలో ఒక పెద్ద శబ్దంతో మాటలు వినిపించాయని చరిత్ర పుటలు చెబుతోంది. గ్రామంలో ఉన్న బసిరెడ్డి చిన్న కోడలు ముసలమ్మను చెరువు కట్టకు బలి ఇస్తే ఈ తెగిన చెరువు కట్ట నిలుస్తుందని ఆ మాటల సారాంశం. ఈ విషయం విన్న గ్రామస్తులు బసిరెడ్డి కుటుంబం వద్దకు వెళ్లి తమ గోడును విన్నవించుకున్నారు. ఈ విషయం విన్న ముసలమ్మ ప్రాణ త్యాగానికి సిద్ధపడింది. అత్తమామల ఆశీర్వాదంతోపాటు ప్రజల అనుమతి తీసుకుని దేవుని ప్రార్థించి ముసలమ్మ కట్ట సమీపంలో ఉన్న చెరువులోకి దూకింది. వెంటనే చెరువు వరద నీరు శాంతించి నిలిచిపోయిందని చరిత్ర చెబుతోంది. ఆ ప్రాంతంలో ఆ కుటుంబానికి చెందిన వంశీయులు సూర్యనారాయణరెడ్డి, సుశీలమ్మ గుడి నిర్మాణం చేశారు. అప్పటి నుంచి గ్రామంలో ఉన్న ప్రజలు చెరువు కట్ట సమీపంలో ఉన్న ముసలమ్మ దేవాలయంలో పూజలు నిర్వహిస్తూ వస్తున్నారు.



ముసలమ్మ తల్లి ఆలయం


ముసలమ్మ మూల విరాట్

ఆలయంలో పూజలు ఇలా..

28న ఆలయంలో ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. సాయంత్రం 6 గంటలకు మూల దేవతా ప్రార్థన, గురు ప్రార్థన, గణపతి పూజ, స్వస్తి వాచనము, రక్షా బంధనం, నిర్వహించనున్నారు. 29న ఉదయం 6 గంటకు అమ్మవారికి అభిషేకం, కలశ స్థాపన గణపతి హోమం, పంచామృతాభిషేకం, కలశ స్థాపన ఆదిత్యా నవగ్రహ హోమం, ముసలమ్మ అమ్మవారి మూల మంత్ర హోమం, ఉదయం 10 గంటలకు మహా పూర్ణాహుతి మధ్యాహ్నం 12 గంటలకు మహా మంగళ హారతి నిర్వహించున్నారు. సాయంత్రం 5గంటలకు ముసలమ్మ తల్లి అమ్మవారి ఉత్సవ విగ్రహం ఊరేగింపు, 30న తెప్పోత్సవం నిర్వహించనున్నారు.

30న తెప్పోత్సవం



30వ తేదీ సాయంత్రం ఆరు గంటలకు బీకేఎస్ మండల కేంద్రంలోని చిక్కవడియార్ చెరువులో తెప్పోత్సవం నిర్వహిస్తాం. మండలంతో పాటు జిల్లా నలుమూ లల నుంచి భక్తులు హాజరై తెప్పోత్సవంలో పాలు పంచుకోవాలి. అలాగే మూడు రోజుల పాటు అన్నదానం నిర్వహిస్తాం. – సుశీల, ఆలయ ధర్మకర్త

అదనపు బాధ్యతల నుంచి తప్పించండి


ఎంపీడీఓకు వినతి పత్రం అందజేస్తున్న వైద్యులు

పెద్దవడుగూరు: ఆరోగ్య సిబ్బందికి ప్రభుత్వం గ్రామ సచివాలయాల ద్వారా అదనపు బాధ్యతలు అప్పగించడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని పెద్దవడుగూరు, క్రిష్టిపాడు గ్రామాల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు శ్రీనివాసబాబు, అమర్‌నాథ్, శ్రీనివాసరెడ్డి, త్రివేణి అన్నారు. అలాగే గ్రామ సచివాలయాల్లో పని చేస్తున్న ఏఎన్ఎం లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పని ఒత్తిడి నుంచి వారిని తప్పించాలని కోరుతూ ఎంపీడీఓ బారెన్ సాహెబ్‌కు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ ఆరోగ్య సేవలు అందించే సర్వేలు కాకుండా అదనంగా సచివాలయ ఉద్యోగుల చేయాల్సిన సర్వేలను కూడా ఆరోగ్య సిబ్బందితో చేయించడం ఎంతో ఇబ్బందిగా ఉందన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ శ్రీనివాసులు, నాగలక్ష్మి, పీహెచ్ఎన్ హేమలత తదితరులు పాల్గొన్నారు.

శుభకార్యం

గుంతకల్లుటౌన్: స్థానిక గాయత్రి ఫంక్షన్‌హాల్‌లో వైఎస్సార్‌సీపీ వలంటీర్ విభాగం నియోజకవర్గం అధ్యక్షుడు బోయ పవన్‌కుమార్–స్వరూప రాణి వివాహానికి గుంతకల్లు మాజీ ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి హాజరై వధూవరులను ఆశీర్వదించారు. ఆయనతో పాటు పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పైసలపై ఉన్న ధ్యాస..పాలనపై లేదా?

- అన్ని విభాగాల్లో అవినీతి
- కమిషనర్ నిరంకుశ వైఖరిపై వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ల ధ్వజం


కౌన్సిల్ మీట్‌ను బహిష్కరించి ఆఫీసు ఎదుట నిరసన తెలుపుతున్న వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు

గుంతకల్లుటౌన్: ప్రజా సమస్యలపై మహిళా కౌన్సిల్ సభ్యులు ప్రశ్నిస్తే..దురుసుగా సమాధానమిస్తారా? మహిళా కౌన్సిలర్లకు మర్యాద ఇవ్వడం తెలియదా? మున్సిపాల్టీలోని అన్ని విభాగాల్లో అవినీతి కంపు కొడుతోంది. మీకు పైసలపై ఉన్న ధ్యాస.. పట్టణాభివృద్ధి.. పాలనపై లేదంటూ మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ నైరుతిరెడ్డి తదితరులు కమిషనర్ నయీమ్ అహ్మద్‌పై నిప్పులు చెరిగారు. గురువారం మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్.భవాని అధ్యక్షతన సాధారణ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ప్రజా సమస్యలపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న కమిషనర్ నయీమ్ తీరుపై వైఎస్సార్‌సీపీ, టీడీపీ కౌన్సిలర్లంతా మూకుమ్మడిగా ధ్వజమెత్తారు. నైరుతిరెడ్డి మాట్లాడుతూ శానిటేషన్ విషయంలో నాడు ఆదర్శంగా ఉన్న గుంతకల్లు మున్సిపాల్టీని అధ్వానంగా మార్చిన ఘనత కమిషనర్‌కే దక్కుతుందన్నారు. మున్సిపల్ రూముల రెన్యువల్‌కు, భవన నిర్మాణ ప్లాన్ అప్రూవల్, బర్త్, డెత్ సర్టిఫికెట్ల మంజూరుకు ప్రజల నుంచి ముక్కుపిండి లంచాలు వసూలు చేస్తున్నారంటూ ఆమె ఆరోపించారు. ప్రజా సమస్యలపై తాను స్వయంగా ఫోన్ చేస్తే మీరెవరంటారా?, కమిషనర్ గారూ.. మీ తీరు మార్చుకోవాలంటూ నైరుతిరెడ్డి సూచించారు. వైస్ చైర్‌పర్సన్ మైమూన్ మాట్లాడుతూ పట్టణంలో శానిటేషన్ అధ్వానంగా మారిందని, పీహెచ్ వర్కర్ల సంఖ్యను పెంచాలని, శుద్ధమైన నీరు సరఫరా చేయాలని కోరారు. కౌన్సిలర్లు నీలావతి, జింకల సుజాత, సుమోబాషా మాట్లాడుతూ తమ వార్డుల్లో సమస్యలు చెబుతుంటే మీరు కామెడీగా తీసుకోవద్దని, తామేమీ స్వీట్లు తిని అజెండాను ఆమోదించడానికి రాలేదంటూ వారు మండిపడ్డారు. టీడీపీ కౌన్సిలర్లు కృపాకర్, సుధాకర్, రవి మాట్లాడుతూ కౌన్సిలర్లుగా గెలిచి నాలుగేళ్లవుతున్నా వార్డుల్లో సమస్యలను పరిష్కరించడం లేదన్నారు. నీటి సమస్య, కుక్కలబెడద అధికంగా ఉందన్నారు. కాంట్రాక్టర్లతో చర్చించి అభివృద్ధి పనులు చేయించాలన్నారు. ఆక్రమణల పేరిట హిందూ దేవాలయాలను కూల్చడం తగదన్నారు. సమస్యలను పరిష్కరించడంలో అధికారుల నిర్లక్ష్య వైఖరిపై చైర్‌పర్సన్ కూడా అసహనం వ్యక్తం చేశారు. కమిషనర్ నయీమ్ నిరంకుశ వైఖరిని వ్యతిరేకిస్తూ వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు సమావేశాన్ని బహిష్కరించారు. కమిషనర్ డౌన్..డౌన్ అంటూ మున్సిపల్ ఆఫీసు ఎదుట నిరసన తెలియజేశారు.

కమిషనర్‌ను అసహ్యించుకుంటున్నారు

మహిళా కౌన్సిలర్ల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న తీరు..మహిళా ఉద్యోగినుల పట్ల మాట్లాడుతున్న బాషను చూసి అందరూ మిమ్మల్ని అసహ్యించుకుంటున్నారంటూ వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ లింగన్న, కోఆప్షన్‌సభ్యుడు రాజశేఖర్ తదితరులు కమిషనర్‌పై విరుచుకుపడ్డారు. వార్డు ప్రజల కోసం ట్యాంకర్ పంపమని అడిగితే ఎంఈ లీలాకృష్ణ ప్రసాద్ తనపైనే దాడికి యత్నిస్తాడా? అంటూ కౌన్సిలర్ లింగన్న మండిపడ్డారు. తనను గౌరవించి మాట్లాడాలని కమిషనర్ అనడంతో వాగ్వాదం పెరిగింది. చివరకు చైర్‌పర్సన్ జోక్యం చేసుకుని వివాదాన్ని సద్దుమణిగించారు.

కంటి వైద్య శిబిరానికి స్పందన



విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

గుంతకల్లు రూరల్: నాగసముద్రం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా దాదాపు 120 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించి కంటి అద్దాలు అవసరమైన ఆరుగురు విద్యార్థులకు రాము ఐకేర్ ఆప్టికల్స్ ద్వారా అందజేయనున్నట్లు లయన్స్ క్లబ్ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ చక్కా జగన్‌మోహన్, సెక్రటరీ తోయ జాక్ష తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలతో అనర్థాలు

యల్లనూరు: బాల్య వివాహాలు, లింగ నిర్ధారణ పరీక్షలు చేయకూడదని హెల్త్ ఎడ్యుకేటర్ సుబ్రహ్మణ్యం, వైద్యాధికారి లోకేష్‌కుమార్ సూచించారు. గురువారం కేజీబీవీలో విద్యార్థినిలకు అవగాహన సదస్సు నిర్వహించారు. వారు మాట్లాడుతూ చిన్న వయస్సులోనే వివాహం చేయడం వల్ల పలు అనర్థాలు చోటుచేసుకుంటాయన్నారు. వేసవికాలంలో విద్యార్థినులు ఆరోగ్యం చాలా జాగ్రత్త తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రత్యేకాధికారి శ్రీలక్ష్మి, హెల్త్ అసిస్టెంట్ కిరణ్, ఏఎన్ఎం ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

164 సెక్షన్ అమలు

గుంతకల్లు రూరల్: మండలంలోని చింతలాంపల్లి గ్రామంలో కొంత కాలంగా స్థల వివాదం నడుస్తున్న నేపథ్యంలో గురువారం పోలీసులు, రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో బీఎన్ఎస్ఎస్ సెక్షన్ 164 అమలుచేస్తూ నోటీసులను ఏర్పాటు చేశారు. గ్రామంలోని సర్వేనెంబర్ 801–ఏలో ఉన్న 14 సెంట్ల స్థలంలో తాతయ్య సమాధి ఉంది. ఇక్కడ గ్రామస్తులు పూజా కార్యక్రమాలు నిర్వహిస్తూ ఉంటారు. ఈ స్థలం కోసం ఇద్దరు వ్యక్తుల మధ్య గత కొంత కాలంగా వివాదం నడుస్తోంది.

ఫంక్షన్ హాల్ సీజ్

గుత్తి: పట్టణంలోని ఆర్ఎస్ రోడ్డులో ఉన్న వసుధ ఫంక్షన్ హాల్‌ను గురువారం మున్సిపల్ అధికారులు సీజ్ చేశారు. 2019 నుంచి 2025 మార్చి వరకూ పన్ను చెల్లించనందుకు సీజ్ చేశారు. మొత్తం రూ.5.30 లక్షల పన్ను చెల్లించాల్సి ఉంది. పలుమార్లు నోటీసులు ఇచ్చినా ఫంక్షన్ హాల్ నిర్వాహకుడు నాగరాజు స్పందించలేదని, దీంతో ఫంక్షన్ హాల్‌ను సీజ్ చేశామని మున్సిపల్ కమిషనర్ జబ్బార్‌మియా తెలిపారు. పన్ను బకాయిల్లో 50 శాతం వడ్డీ రాయితీ ఇస్తామని చెప్పినా రూపాయి కూడా చెల్లించలేదన్నారు.

పెద్దమ్మకు వెండి కవచం వితరణ


అలంకరణలో పెద్దమ్మతల్లి

పెద్దపప్పూరు: మండలంలోని కొట్టాలపల్లిలో వెలసిన పెద్దమ్మతల్లికి అదే గ్రామానికి చెందిన సర్పంచు పాత్తూరు శ్రీనివాసనాయుడు రూ.లక్ష విలువచేసే వెండి కవచాన్ని అమ్మవారికి వితరణ చేశారు. అర్చకులు కవచానికి ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారికి అలంకరించారు. అనంతరం దర్శనానికి విచ్చేసిన భక్తులకు తీర్థప్రసాదాలతో పాటు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

రీ-సర్వే సద్వినియోగం చేసుకోవాలి

గుంతకల్లు రూరల్: భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రభుత్వం చేపట్టిన రీ సర్వే కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ రమాదేవి సూచించారు. రెండో విడత రీ సర్వే కార్యక్రమంలో భాగంగా గురువారం మండలంలోని దోసలుడుకి, దోనిముక్కల గ్రామాల్లో రెవెన్యూ సిబ్బంది రీ సర్వే గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ ఆధ్వర్యంలో ఆయా గ్రామాల్లో ర్యాలీ నిర్వహిస్తూ రీ సర్వే కార్యక్రమంపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. అనంతరం గ్రామసభ నిర్వహించి రీసర్వే కార్యక్రమం వల్ల రైతులకు కలిగే ఉపయోగాలను వివరించారు.

పురుగుల మందు తాగి యువకుడి ఆత్మహత్య

గుంతకల్లు రూరల్: అనారోగ్య సమస్యలను తాళలేక ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... గుంతకల్లు మండలం మైనాపురం గ్రామానికి చెందిన కృష్ణ, కృష్ణవేణి దంపతులకు ఇద్దరు కుమార్తెలు కుమారుడు చెన్నకేశవులు (23) ఉన్నారు. పెద్ద కుమార్తె విదేశాల్లో ఎంఎస్ చేస్తోంది. చిన్న కుమార్తె మద్రాస్‌లో బీటెక్ ఫైనల్ ఇయర్ చదువుతోంది.చెన్నకేశవులు బీటెక్ పూర్తి చేసి ఆరునెలల క్రితం సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా చేరి, వర్క్ ఫ్రం హోమ్ విధానంలో ఇంటి వద్ద నుంచే విధులు నిర్వర్తిస్తున్నాడు. రెండేళ్లుగా యూరిన్ ఇన్‌ఫెక్షన్, కడుపునొప్పితో బాధపడుతున్న చెన్నకేశవులకు తల్లిదండ్రులు చికిత్స చేయిస్తున్నారు. వ్యాధి తీవ్రత తగ్గకపోవడంతో జీవితంపై విరక్తి పెంచుకున్న చెన్నకేశవులు బుధవారం రాత్రి 11 గంటలకు పురుగుల మందు తాగాడు. కాసేపటికి పరిస్థితి విషమించి వాంతులు కావడంతో విషయాన్ని తల్లిదండ్రులకు తెలిపాడు. దీంతో వారు వెనువెంటనే గుత్తిలోని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యుల సూచన మేరకు అనంతపురానికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. ఘటనపై కసాపురం పోలీసులు కేసు నమోదు చేశారు.

రైల్వేస్టేషన్‌లో తాగుబోతు హల్‌చల్

తాడిపత్రి: పూటుగా మద్యం సేవించి, ఓ ప్రయాణికుడు తాడిపత్రి రైల్వే స్టేషన్‌లో హల్ చల్ చేశాడు. బుకింగ్ క్లర్క్‌గా పని చేస్తున్న ఓ మహిళా ఉద్యోగిపై బూతులకు దిగాడు. ఈ ఘటన గురువారం రాత్రి తాడిపత్రి రైల్వేస్టేషన్‌లో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. తాడిపత్రి నుండి కడపకు టికెట్ ఇవ్వాలని ఓ ప్రయాణికుడు మద్యం సేవించి వచ్చి, బుకింగ్ కౌంటర్‌లో పని చేసే ఓ మహిళా ఉద్యోగిని అడిగాడు. కడప వెళ్లే రైలు వచ్చేందుకు ఇంకా 4 నుంచి 5 గంటల సమయం పడుతుందని, ఇప్పుడే టికెట్ ఇవ్వడం కుదరదని సదరు మహిళా బుకింగ్ క్లర్క్ తెలిపారు. దీంతో ప్రయాణికుడు మహిళా బుకింగ్ క్లర్క్‌పై బూతులతో రెచ్చిపోయాడు. మహిళా ఉద్యోగి అని చూడకుండా తోటి ప్రయాణికుల ముందర నానా రభస చేస్తూ, చిందులు వేశాడు. వారించబోయిన పలువురు ప్రయాణికులపై మండిపడడంతో పాటు, వారిపై సైతం తిట్ల పురాణంతో రెచ్చిపోయాడు. దీంతో ప్రయాణికులు అక్కడే ఉన్న రైల్వే సిబ్బందికి విషయం తెలియజేయగా, రైల్వే ఏఆర్ ఎస్ఐ ప్రసాద్ తాగుబోతుని అదుపులోకి తీసుకున్నారు. ఫుల్లుగా తాగి ఉండడంతో ప్రయాణికుడి గురించి వివరాలు ఏవీ రాబట్టలేకపోయామని, మద్యం మత్తు దిగిన తర్వాత వివరాలు తెలిసే అవకాశం ఉంటుందని ఏఆర్ ఎస్ఐ తెలిపారు.

వైస్ ఎంపీపీలు వైఎస్సార్‌సీపీ కైవసం


డిక్లరేషన్ ఫారం అందుకుంటున్న పెద్దపప్పూరు వైస్ ఎంపీపీ నాగవేణి

పెద్దపప్పూరు: మండలంలో ఖాళీగా ఉన్న వైస్ ఎంపీపీ–2 పదవికి గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎన్నికల ప్రక్రియ నిర్వహించారు. పసలూరు ఎంపీటీసీ నాగవేణి వైస్ ఎంపీపీ–2కు నామినేషన్ వేయగా మాజీ ఎంపీపీ రామ్మూర్తిరెడ్డి, నరసాపురం ఎంపీటీసీ శంకరయ్య బలపర్చారు. ఇతరులెవ్వరూ నామినేషన్ వేయకపోవడంతో నాగవేణిని ఎన్నికల రిటర్నింగ్ అధికారి ప్రభాకర్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. అనంతరం ఎంపీపీ వెంకటరామిరెడ్డి, మండల నాయకులు మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డికి ఫోన్ చేసి కృతజ్ఞతలు తెలిపారు. అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పెద్దవడుగూరు సీఐ రామసుబ్బయ్య, ఎస్ఐ నాగేంద్రప్రసాద్ 144 సెక్షన్ విధించి, బందోబస్తు పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శంకుంతల తదితరులు పాల్గొన్నారు.


డిక్లరేషన్ ఫారం అందుకుంటున్న యల్లనూరు వైస్ ఎంపీపీ రమాదేవి

యల్లనూరు వైస్ ఎంపీపీ–2గా రమాదేవి

యల్లనూరు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వైస్ ఎంపీపీ –2 ఎన్నికలు గురువారం నిర్వహించారు. గతంలో వైస్ ఎంపీపీ–2గా ఉన్న రంగయ్య గుండెపోటుతో మృతి చెందడంతో ఖాళీగా ఉన్న ఆ స్థానానికి అనంతపురం ఆర్డీఓ కేశవనాయుడు, మండల స్పెషలాఫీసర్ రఘునాథరెడ్డి ఆధ్వర్యంలో ఎన్నిక నిర్వహించారు. తొమ్మిది మంది ఎంపీటీసీలు హాజరై వైఎస్సార్‌సీపీకి చెందిన తిమ్మంపల్లి ఎంపీటీసీ పందిర్లపల్లి రమాదేవిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వైస్ ఎంపీపీ–2గా ఎన్నికైన రమాదేవికి ఎంపీపీ గంగాదేవి, ఎంపీడీఓ వాసుదేవరెడ్డి డిక్లరేషన్ ఫారం అందజేశారు. అవాంచనీయ ఘటనలు జరగకుండా ఎస్ఐ రామాంజనేయరెడ్డి బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాజా, కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు విశిష్ట గుర్తింపు సంఖ్య తప్పనిసరి

గార్లదిన్నె: ప్రతి రైతూ విశిష్ట గుర్తింపు సంఖ్య రిజిస్టర్ చేసుకోవాలని వ్యవసాయ శాఖ ఏడీఏ రవి తెలిపారు. గురువారం మండలంలోని ఇల్లూరు, కల్లూరు, కల్లూరు అగ్రహారం రైతు సేవా కేంద్రాల్లో రైతుల రిజిస్టర్ సంఖ్య నమోదు కార్యక్రమాన్ని ఏడీఏ రవి పరి శీలించారు. ఆయన మాట్లాడుతూ మండల వ్యాప్తంగా 11,000 వేల మంది రైతులు ఉండగా ఇప్పటి వరకూ 5,500 మంది రైతులు రైతు విశిష్ట గుర్తింపు సంఖ్యకు నమోదు చేసుకున్నారన్నారు. విశిష్ట సంఖ్య ఉంటే పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ పంటల బీమా , పంటల కనీస మద్దత ధర, పంట రుణాలు వంటివి వస్తాయన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి సోమశేఖర్, రైతులు పాల్గొన్నారు.

నీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు


అభివృద్ధి పనులను ఎమ్మెల్యేకు వివరిస్తున్న కమిషనర్

తాడిపత్రి రూరల్: మునిసిపాలిటీలో వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని నీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి సూచించారు. మునిసిపల్ కార్యాలయంలో గురువారం చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో కౌన్సిల్ సాధారణ సమావేశం నిర్వహించారు. మునిసిపాలిటీలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగిగా పని చేస్తున్న ధనలక్ష్మి ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో రెండు నిమిషాలు సభ్యులు మౌనం పాటించారు. సమావేశానికి ఎక్స్ అఫీషియో మెంబర్‌గా ఎమ్మెల్యే హాజరయ్యారు. మంగళగిరితో సమానంగా తాడిపత్రి మునిసిపాలిటీకి నిధులను కేటాయించి అభివృద్ధికి సహకరించాలని మంత్రి లోకేష్‌ను కోరారని ఎమ్మెల్యే తెలిపారు. మునిసిపాలిటీలో జరుగుతున్న అభివృద్ధి పనులు, నిధుల కేటాయింపు తదితర అంశాల గురించి ఎమ్మెల్యేకు కమిషనర్ శివరామక్రిష్ణ వివరించారు. చైర్మన్ మాట్లాడుతూ పట్టణంలో ఎక్కడ పడితే అక్కడ వాహనాలను నిలిపితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ట్రాఫిక్‌కు అంతరాయంగా మారుతున్న అనధికార పార్కింగ్‌ల వల్ల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. వివిధ అంశాలపై సభ్యులు ఆమోదం తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు రాఘవేంద్రప్రసాద్, రూప తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా 'సతామి' పండుగ


పామిడిలోని మసీదులో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

పామిడి: గుంతకల్లు, తాడిపత్రి, శింగనమల నియోజకవర్గాల్లో ముస్లింలు సతామి పండుగను ఘనంగా జరుపుకున్నారు. గరువారం రాత్రంతా మసీదుల్లో భక్తిప్రపత్తులతో పార్థనలు చేస్తూ జాగరణ చేశారు. పవిత్ర ఖురాన్ అవతరించిన రాత్రి అవ్వడంతో ముస్లింలు రాత్రంతా జాగరణ చేస్తూ ప్రార్థనలతో ఆధ్మాతిక చింతనతో ఈ బడేరాత్‌ను భక్తిశ్రద్ధలతో పాటిస్తారు. అల్లా మన్నించే గుణం కలవాడని, తద్వారా తాము తెలియక చేసిన తప్పులను మన్నించుమని కోరుతూ ముస్లింలు సతామి పండుగను ఆచరిస్తారు. సతామి పర్వదినాన్ని సద్వినియోగం చేసుకోవడం వల్ల జన్మజన్మల పుణ్యఫలం ఈ ఒక్క రాత్రితోనే లభిస్తుందన్నది ముస్లింల విశ్వాసం. అందులో భాగంగా పామిడి మండలంలోని మసీదులను ముస్తాబు చేశారు. రాత్రంతా ముస్లింలు మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనల్లో గడిపారు.

మృతదేహానికి రీ-పోస్టుమార్టం

పుట్లూరు: మండలంలోని మడ్డిపల్లిలో గత ఏడాది నవంబర్ 19న పాతిపెట్టిన వినోదినీదేవి మృతదేహాన్ని గురువారం వెలికి తీసి మరోమారు పోస్టుమార్టం నిర్వహించారు. వివరాలు.. మడ్డిపల్లికి చెందిన బాణా రమణారెడ్డికి, వినోదినీదేవికి 2007లో వివాహం జరిగింది. వీరు తాడేపల్లిలో నివాసముంటుండగా వినోదినీదేవి మృతిచెందడంతో తమ స్వగ్రామం మడ్డిపల్లిలో 2024 నవంబర్ 19న అంత్యక్రియలు నిర్వహించారు. అయితే ఆమె మృతిపై కుటుంబసభ్యులు తాడేపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో అక్కడి పోలీసులు కేసు నమోదు చేశారు. న్యాయస్థానం ఆదేశాలతో తహసీల్దార్ శేషారెడ్డి సమక్షంలో వినోదినీదేవి మృతదేహాన్ని వెలికి తీసి వైద్యుల మళ్లీ పోస్టుమార్టం నిర్వహించారు.


మృతదేహాన్ని పాతిపెట్టిన చోటును పరిశీలిస్తున్న అధికారులు